
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 258 ఎడిటర్: కె.యువరాజ్ ఆదివారం 28-6-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## ఇక దూకుడే



**- స్పీడు పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు - భారీ మార్పులు చేపడుతున్న సీఎం రేవంత్ - సమర్థులైన అధికారులకు పాలనా పగ్గాలు - కాబోయే సీఎస్ సంజయ్‌జాజుకు దిశానిర్దేశం**

**హైదరాబాద్, జూన్ 27 (వన్‌నేషన్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గేరు మార్చి.. స్పీడు పెంచబోతోంది. పాలనను టాప్‌గేర్‌లో పెట్టబోతోంది. ప్రతిపక్షాల విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా, ప్రజలకు మరింత దగ్గరయ్యేలా వ్యూహరచన చేస్తోంది. తాను చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలకు పూర్తి స్థాయి ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికి రెండున్నరేళ్లు పూర్తయింది. ఎన్నికలకు ఇంకా మిగిలింది మరో రెండున్నరేళ్లే. చివరి ఆరు నెలల్లో అంతా ఎన్నికల హడావుడే ఉంటుంది. అంటే.. ప్రభుత్వం తాను తలచింది చేయాలన్నా, చేసింది చెప్పాలన్నా, వచ్చే ఎన్నికల కోసం సిద్ధం కావాలన్నా.. రెండేళ్లలోనే చేయాలి. దీంతో ఈ రెండేళ్ల సమయం రేవంత్ సర్కారుకు అత్యంత కీలక దశ కానుంది. చేపట్టిన పథకాలకు పూర్తి స్థాయి ఫలితాలు రాబట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. ఇందుకోసం సమర్థ అధికార యంత్రాంగం అవసరమని భావించిన సర్కారు శుక్రవారం భారీ మార్పులు చేసింది. పథకాల అమలులో సమర్థుడైన ఐఏఎస్ సంజయ్ జాజును సీఎస్‌గా నియమించింది. సీఎంవోలోనూ మార్పులు చేసింది. జూలై మొదటి పక్షంలో మరిన్ని మార్పులు చేసే ఆలోచనలో ఉంది.

ఇప్పటికే ప్రభుత్వం పలు దీర్ఘకాలిక ప్రాజెక్టులను ప్రారంభించింది. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టును గాడిలో పెట్టే దిశగా చర్యలు చేపడుతోంది. దీనికి అవసరమైన కేంద్ర రక్షణ శాఖ భూములపై అనుమతులు సాధించింది. ప్రాజెక్టు కోసం అప్పు సాధించడమే మిగిలి ఉంది. కేంద్రం నుంచి ఎలాంటి నిధులు వచ్చే సూచనలు కనిపించకపోవడంతో ప్రభుత్వమే సొంతంగా ప్రాజెక్టు చేపట్టేలా కసరత్తు చేస్తోంది.



## మీ భవిష్యత్తు నా బాధ్యత..

**- భూములిచ్చిన మీ త్యాగం వృథా కాదు**



**మార్కాపురం, జూన్ 27 (వన్‌నేషన్):** 'వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం ఒక చరిత్ర. ప్రాజెక్ట్ కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు వదిలేసిన మీ త్యాగం వృథా కాదు. మీ దాతృత్వం వల్ల నాలుగు జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మీ పేరు చెప్పుకొని 23 లక్షల మంది ప్రజలు వెలిగొండ నీళ్లు తాగుతారు. వారి ఆశీస్సులతో మీ అందరి జీవితాలు మెరుగ్గానే ఉంటాయి. మీ భవిష్యత్తుకు అండగా నేనుంటా. మీ అందరి జీవితాల్లో ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత నేనే తీసుకుంటా." అని వెలిగొండ ముంపు గ్రామాల నిర్వాసితులు, రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద శనివారం వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం కింద మొదటి విడత రూ.300 కోట్లు నమూనా చెక్కును సీఎం అందజేశారు.

వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కాలువను పరిశీలించిన ఆయన, అక్కడి పొలాల్లో రైతులు, నిర్వాసితులతో మాట్లాడారు. వెలుగొండకు 1996లో నేనే శంకుస్థాపన చేశా. ఇప్పుడు నేనే పూర్తి చేసుతన్నా. ప్రస్తుత లెక్కల ప్రకారం ప్రాజెక్ట్ పూర్తి కావడానికి రూ.10,580 కోట్లు అవసరం. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో రూ.759 కోట్లు గత రెండేళ్లలోనే ఖర్చు పెట్టాం. ఇప్పుడు నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేశాం. అందులో రూ.300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. గత వైసీపీ ఐదేళ్లలో కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మేం నిర్వాసితుల కోసమే రూ.905 కోట్లు, నిర్మాణ పనులకు రూ.3వేల కోట్లకు పైగా వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులను కూడా రూ.140 కోట్లు చెల్లించాం.

## టేకాఫ్‌కు అంతా సిద్ధం





**విజయనగరం, జూన్ 27 (వన్‌నేషన్):** నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి చోదక శక్తిగా నిలిచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అంతా సిద్ధమైంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తిచేశారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గడువులోగా పనులన్నీ చకచకా పూర్తయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ఎయిర్‌పోర్టును ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ విషయంలో ప్రధాని కార్యాలయం ఇచ్చే తుది షెడ్యూల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోంది. ఎయిర్‌పోర్టు టెర్మినల్ బిల్డింగ్, రన్‌వే, ఏటీసీ టవర్ పనులు వంద శాతం పూర్తయ్యాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం జూలైలో మంచి రోజులు ఉన్నాయంటూ ప్రధానమంత్రి కార్యాలయానికి ప్రతిపాదనలు పంపింది. భోగాపురం విమానాశ్రయంతో పాటు మరిన్ని ప్రాజెక్టులు కూడా ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.



హైదరాబాద్, జూన్ 27 (వన్‌నేషన్): మాజీ GCPE ప్రిన్సిపాల్ డా. కె. రామి రెడ్డి, హైదరాబాద్‌లోని ఖీవీజలో డా. బి. లక్ష్మయ్యకు "అంబాసడర్ ఆఫ్ స్పోర్ట్స్" అవార్డును ప్రదానం చేశారు.

## 'సర్'పై వారిది బాధ్యతారాహిత్యం

**- దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం: కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్, జూన్ 27 (వన్‌నేషన్):** ఓటరు జాబితా సమగ్ర సవరణ(సర్)పై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎంఐఎం మద్దతు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 'సర్'ను మతంతో ముడిపెడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 'హైదరాబాద్‌లో అక్రమ వలసదారులు లేరా? భారీగా నకిలీ ఓట్లు లేవా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. 'సర్' ప్రక్రియతో కేంద్ర ఎన్నికల కమిషన్ వీటిని సరిచేస్తుంటే, దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. 'సర్ ప్రక్రియను అమలు చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. అయితే, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలను చూస్తుంటే సొంత ప్రభుత్వ ఉద్యోగులపైనే వారికి నమ్మకం లేనట్లుగా కనిపిస్తోంది. పాతబస్తీలో ఇంటింటి సర్వే చేయవద్దని ఉద్యోగులను ఎంఐఎం బెదిరిస్తోంది. తాము ఇచ్చిన ఫారాలనే తీసుకోవాలని ఒత్తిడి తెస్తోంది. ఇది అత్యంత ప్రమాదకర ధోరణి' అని కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడ స్థిరపడ్డవారు ఇక్కడి ఓటరు జాబితాలోనే తమ పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. 'మీ ఓటు గ్రామంలో లేకపోతే సంక్షేమ పథకాలు అందబోవు అంటూ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దు. ఓటరు జాబితాలో పేరు నమోదుకు, సంక్షేమ పథకాలకు సంబంధం లేదు' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక


**విలేకరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.



9948222240

# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

**- మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ -**

**సూర్యాపేటలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం**

**సూర్యాపేట, జూన్ 27 (వన్‌నేషన్):** క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దేశంలో ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు సూర్యాపేటలో ఉన్న హోటల్ శ్రీ గ్రాండ్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు'.



ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ 'అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ-జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు'.




### రెసోనెన్స్ విద్యాసంస్థలు, తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ గురించి

రెసోనెన్స్ అనేది ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ 2001లో రాజస్థాన్‌లోని కోటాలో స్థాపించారు. ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ప్రతిష్టాత్మక విద్యా సంస్థ. గత రెండు దశాబ్దాలుగా రెసోనెన్స్ 87 నగరాల్లోని 150 పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల (1 మిలియన్) పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాలయాలు, టాప్ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలు పొందారు.

దేశవ్యాప్తంగా ఉన్న ఈ బలమైన వారసత్వంతో, పూర్ణచంద్రరావు నర్రా దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రెసోనెన్స్ 2018లో హైదరాబాద్‌లో ఒకే ఒక్క క్యాంపస్‌తో ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఐఐటీ-జేఈఈ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు సమగ్రమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్, ఫలితాల ఆధారిత విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతర విజయాలకు, విద్యా నైపుణ్యానికి రెసోనెన్స్ విద్యాసంస్థలు ఒక చిహ్నంగా మారాయి. కేవలం ఏడు సంవత్సరాలలోనే, రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 6,100 పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్, ఇతర అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించారు. ఈ అద్భుతమైన విజయాల స్ఫూర్తితో, రెసోనెన్స్ ఇప్పుడు ఫౌండేషన్ సెంటర్లు, పాఠశాలలు, ఈ-లెర్నింగ్, గ్లోబల్ స్టడీస్ రంగాలలోకి విస్తరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్‌లతో విజయవంతంగా దూసుకుపోతోంది. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9985310069

# పార్క్ హోటల్ రాజ్ భవన్ రోడ్ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవం

**హైదరాబాద్, జూన్ 27 (వన్‌నేషన్):** ఇన్స్పైడ్ సక్సెస్ మీడియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ సదరన్ ఇండియా అవార్డ్స్ 2026లో శ్రీ మాచవరం ప్రవీణ్ కుమార్‌కి ఎక్సెన్స్ ఇన్ కార్పొరేట్ కమ్యూనికేషన్ అండ్ బ్రాండింగ్




లీడర్షిప్ అవార్డు, ప్రముఖ నటి మరియు పూర్వ రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి జయప్రద చేతులమీదుగా అవార్డు అందుకోవడం జరిగింది. వీరు గత 30 సంవత్సరాలుగా అటు బిజినెస్ రంగంలో ఇటు ఐటీ రంగంలో వివిధ హోదాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం కోర్ ట్రాక్టర్ ఐ.టి. ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకి వైస్ ప్రెసిడెంట్ గా సేవలు అందిస్తున్నారు. శనివారం 27 జూన్ 2026న పార్క్ హోటల్ రాజ్ భవన్ రోడ్ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో వీరికి కార్పొరేట్ కమ్యూనికేషన్ మరియు బ్రాండింగ్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. వీరు ఇటు కార్పొరేట్ బిజినెస్ రంగాల్లోనే కాకుండా తెలుగు సినిమా రంగంలో కూడా రచయితగా మరియు గీత రచయితగా తమ ప్రతిభను చూపుతున్నారు.

# సర్ పై ఓటర్లకు అవగాహన : మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



**మల్కాజిగిరి, జూన్ 27 (వన్‌నేషన్):** వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్,వినోభా నగర్ లో బూత్ నంబర్లు 239,241 వద్ద సర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకి మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడి ఓటు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ఒక్క నిజమైన ఓటు కూడా తొలగిపోకుండా కాపాడుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ అధికారి తిరుమలదేవి, బీజేపీ నాయకులు మల్లేష్, సాయి సురేష్, సుమలత, ప్రశాంత్ పాల్గొన్నారు.

# పద్మారావు ఆకస్మిక మరణం తీరనిలోటు : కల్వకుంట్ల కవిత



**వన్ నేషన్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 27 (వన్‌నేషన్):** తెలంగాణ ఉద్యమ నేత దివంగత గొట్టిముక్కల పద్మారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవి తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు దివంగత నేత గొట్టిముక్కల పద్మారావు కుటుంబ సభ్యులను శనివారం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కూకట్పల్లి ప్రాంతం నుండి గొట్టిముక్కల పద్మారావు తన వంతు కృషి చేశారని కొనియాడారు. పద్మారావు ఆకస్మిక మరణం తీరనిలోటని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వట్టిముక్కల పాండురంగారావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సృజన, బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబల మహేష్ గౌడ్, మేకల సుదర్శన్, ఈ సునీల్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్‌లో ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాలు



**బాలాపూర్, జూన్ 27 (వన్‌నేషన్):** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ బాలాపూర్ 62వ డివిజన్ బాలాపూర్ లో నిర్వహించిన శ్రీ బొడ్రాయి దేవత ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీ బొడ్రాయి దేవత ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా పూజలు చేసిన కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మరియు పిసిసి కార్యదర్శి యేల్మేటీ అమరేందర్ రెడ్డి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు యేల్మెటి అమరేందర్ రెడ్డి కి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్లెం ఎల్లారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, కల్లెం శ్రీధర్ రెడ్డి, వంగేటి మధుసూధన్ రెడ్డి, మేకల సంజీవ తధితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌర సమ్మేళనం



**హైదరాబాద్, జూన్ 27 (వన్‌నేషన్):** విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రవి పిలుపునిచ్చారు ఈ మేరకు శనివారం ముషీరాబాద్ కాంసెన్సీ లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం గోడ పత్రికను పలువురు నేతలతో కలసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూన్ 28న ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహించామని నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమ కారుకులకు ఇచ్చిన హామీల లో భాగంగా 250 గజాల ఇంటి స్థలం ఉద్యమకారులకు గుర్తింపు కార్డు అదే విధంగా పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు వేల సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ ఉద్యమాల సంఘాల రాష్ట్ర నాయకులు మరియు చాగంటి శేఖర్ మరియు గుండ్రం రాకేష్ అచ్చి అచ్చేందర్ రాజు యాదవ్ గోవర్ధన్ పాండురవ్ బాల నరసింహ శ్రీనివాసులు మహేష్ తదితరులు పాల్గొన్నారు

# అంబుజా సిమెంట్ కంపెనీ రద్దు

### ఈనెల 29న విజయోత్సవ సభ



**యాదాద్రిజిల్లా: రామన్నపేట, జూన్ 27 (వన్ నేషన్ ):** ఈనెల 29న మండల కేంద్రంలోని రహదారి బంగ్లా ఆవరణలో పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు రద్దును పురస్కరిం చుకొని విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య,కో కన్వీనర్ మహమ్మద్ రెహన్ సభ్యులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో వేదిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రామన్నపేట లో పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే ప్రతిపాదిత అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చెయ్యడం లేదంటూ ఆ ప్రతిపాదనను.విరమించుకున్నామని కంపెనీ వర్గాలు ప్రకటించడం ప్రజల పోరాట విజయం అని వారన్నారు. సిమెంట్ కంపెనీ రద్దు కావాలని,మా ప్రాంతంలో ఏర్పాటును అంగీకరించమని మండల వ్యాప్తంగా అశేషమైన ప్రజానికం, అఖిలపక్షాలు, వివిధ వృత్తి దారులు, విద్య, యువజన, స్వచ్ఛంద సేవ సంస్థలు, విశ్రాంత ఉద్యోగులు సబ్బండ వర్గాలు ఉద్యమించి తిప్పికొట్టాయని వారన్నారు. ఈ ఉద్యమ స్ఫూర్తిని మననం చేసుకోవడం కోసం, ప్రజలను అఖిలపక్షాలను, అభినందించడంతోపాటు విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని, సబ్బండ వర్గాలు తరలివచ్చి, విజయోత్సవ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, వివిధ పార్టీల నాయకులు హాజరుకానున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు ఊట్కూరు నరసింహ, ఎండి జమీరోద్దీన్, కందుల హనుమంతు, ఫజల్ బేగ్, నోముల చిరంజీవి, రాజు, బత్తుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక

# 99 రోజుల కార్యక్రమం అమలుపై సమీక్ష



**రంగారెడ్డి జిల్లా, జూన్ 27 (వన్ నేషన్):** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి, ఫ్లాగ్‌షిప్ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాల అమలు విభాగం, సీఎస్ఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సవ్యసాచి గోష్ సూచించారు.

శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం, సేవల అందజేత, మౌలిక సదుపాయాల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలులో విశేష ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమంలో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకొని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి సకాలంలో అందేలా అన్ని శాఖలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతోందో పరిశీలించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడం లక్ష్యంగానే ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుంచి వినతులను స్వీకరించి సత్వర చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అధికారుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.

రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విజయవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులను ప్రత్యేక అధికారి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పనితీరును కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ లబ్ధిదారుని విస్మరించకూడదని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ విధానాలను వినూత్న ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలుపరచడం ద్వారా రంగారెడ్డి జిల్లా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. పథకాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా సమర్థవంతమైన కార్యక్రమాలు అమలు చేసినట్లు ప్రశంసించారు. ఆర్థిక వ్యవహారాల విషయంలో పూర్తి అప్రమత్తతతో పథకాలను అమలు చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం జిల్లా శాఖల అధికారులు ఆయా శాఖల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యా లయానికి చేరుకున్న ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, సిపిఓ సౌమ్య, ట్రాఫిక్ డీసీపీ, ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, సరిత, డిపిఓ సురేశ్ మోహన్, డీఆర్డీఏ పిడి శ్రీలత, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, సంక్షేమ శాఖ అధికారులు కేశురామ్, నవీన్ కుమార్ రెడ్డి, రామేశ్వరి దేవి, థీమ్ నోడల్ అధికారులు, జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సుచేత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీలలో బియాండ్ ది కలర్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్





**హైటెక్ సిటీ/వన్ నేషన్ :** హైటెక్ సిటీ శిల్పారామంలో ఐఎన్. ఐ.ఎఫ్టి, ఎస్విటిఐ, ఆర్.వి.టి ఐ, హెచ్.ఏ.ఎం.ఎస్ టి.ఈ. సి.హెచ్ అండ్ ఐ.సి. ఈ.ఐ మాజీ అధ్యాపకురాలు సుచేత దాస్ దే ఆధ్వర్యంలో సుచేత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా బియాండ్ ది కలర్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఈనెల 27, 28 తేదీలలో నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులుగా డా. ఇమాని శివనాగిరెడ్డి ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ, డా. ఎనుగు నరసింహారెడ్డి ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, డా. మనీష్ గౌర్ ప్రణామ్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్. ప్రొఫెసర్ ఎం.ఎల్. ఆనంద్ రావు జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ) ప్రిన్సిపాల్, డా. ప్రగ్యా శ్రీవాస్తవ వ్యవస్థాపకురాలు అండ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ ప్రసూతి, స్త్రీరోగ నిపుణురాలు, ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్స నిపుణురాలు. ప్రొఫెసర్ (ప్రోస్థోడాంటిక్స్) కన్సల్టెంట్ వ్యాక్సిలో ఫేషియల్ ప్రోస్థెటిస్ట్, స్వతంత్ర కళాకారుడు పాల్గొని ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు.





ఈ సందర్భంగా నిర్వాహకులు సుచేత దాస్ దే మాట్లాడుతూ 27వ తేదీ మొదటి రోజు చాలా ఘనంగా ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. ప్రతి సంవత్సరం ఈ విధమైన ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కళాకారులను ప్రోత్సహించే దిశగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు. ఇందులో కొన్ని జనరేషన్స్ నుండి మహిళ తన త్యాగాలకు నివాళులుగా ఆ ప్రదర్శనలో చిత్రపటాలు ప్రదర్శించినట్లు తెలిపారు.











# ధనుష్‌తో శ్రీలీల స్టెప్పులు?

ఓ వైపు నటన.. మరోవైపు అదిరిపోయే స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది అందాల తార శ్రీలీల. ఇప్పుడీమె మరోసారి తన స్టెప్పులతో తెరపై మ్యాజిక్ చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఓం'. రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కథానాయికలుగా శ్రీలీల, సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగానే తాజాగా ఈ చిత్రంలో ధనుష్, శ్రీలీల కాంబినేషన్‌లో వచ్చే ఓ పాట షూటింగ్ కోసం చెన్నైలో భారీ సెట్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. 'మారి 2'లోని 'రౌడీ బేబీ..' పాట తరహాలో ఉత్సాహభరితమైన డ్యాన్స్ స్టెప్పులతో ఈ గీతాన్ని తీర్చిదిద్దుతున్నట్లు, ఇందులో ధనుష్‌తో శ్రీలీల వేసే చిందులు సినిమాకే ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎర్రచందనం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు.

# 'బార్డర్ 3'కి సిద్ధం!



1971 నాటి భారత్-పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బార్డర్ 2'. సన్నీ దేఓల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఈ ఏడాది ప్రారంభంలోనే విడుదలై ప్రేక్షకుల్ని అలరించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా మూడో భాగం రాబోతున్నట్లు జేపీ దత్తా కుమార్తె, నిర్మాత నిధి దత్తా అధికారికంగా వెల్లడించారు. దీంతో పాటు 1965 ఇండో-పాకిస్థాన్ యుద్ధ సమయంలో భారత సైన్యానికి నాయకత్వం వహించిన యుద్ధ వీరుడు జనరల్ హర్‌బక్ష్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా ఓ చిత్రం, ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన పరిస్థితుల నేపథ్యంలో మరో సినిమా, నిధి వేటకు సంబంధించిన ఓ యాక్షన్ అడ్వెంచర్‌తో పాటు.. తన తాత చిత్రనిర్మాత ఓపీ దత్తాపై ఓ సిరీస్‌ను తెరకెక్కించబోతున్నట్లు.. మొత్తంగా ఐదు ప్రాజెక్టుల్ని ప్రకటించారు. జేపీ ఫిల్మ్స్ నిర్మాణంలో రాబోతున్న ఈ చిత్రాల షూటింగ్ మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని, త్వరలోనే వీటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడతాయని నిధి దత్తా తెలిపారు.



# విజయ్‌ను అన్‌ఫాలో చేసిన త్రిష.. నెట్టింట కొత్త చర్చ!




కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో విజయ్-త్రిష పేర్లు వైరలైన విషయం తెలిసిందే. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వీరిద్దరూ విడిపోయారని ప్రచారం జరుగుతోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ సీఎం అయ్యాక తొలి పుట్టినరోజు కావడంతో త్రిష విషెస్ కోసం అందరూ ఎదురుచూశారు. ప్రతి సంవత్సరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపే త్రిష మాత్రం ఈసారి ఎలాంటి పోస్ట్ పెట్టకపోవడంతో నెట్టింట కొత్త చర్చ ప్రారంభమైంది.. కొన్నేళ్లుగా విజయ్ (Vijay) పుట్టినరోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను త్రిష పంచుకునే వారు. కానీ, ఈసారి ఆమె మౌనంగా ఉండడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారు. దీంతో ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది.



# ఈసారీ యాక్షన్ బాటే!

షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాతో హిందీలోకి తొలి అడుగు వేసింది నటి నయనతార. అందులో ఆమె యాక్షన్ ప్రాధాన్యమున్న పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తను సల్మాన్ ఖాన్ చిత్రంతో మరోసారి హిందీ ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి కూడా ఆమె కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్షన్‌తోనూ అదరగొట్టనుందని సమాచారం. ఇటీవలే ఈ సినిమాకి సంబంధించిన కీలక షెడ్యూల్‌ని పూర్తి చేయగా.. నయన్‌పై కొన్ని పోరాట సన్నివేశాల్ని చిత్రీకరించినట్లు తెలిసింది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాని వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది రంజాన్‌కి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది.

# పెద్ద సినిమాలు 50 రోజుల పిక్నిక్ లాంటివే: మనోజ్ బాజ్‌పేయి



బాలీవుడ్‌లో భిన్నమైన సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు మనోజ్ బాజ్‌పేయి . ఇటీవల కమర్షియల్ సినిమాల కంటే చిన్న బడ్జెట్ సినిమాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. పెద్ద బడ్జెట్ సినిమాలను '50 రోజుల పిక్నిక్'గా భావిస్తానని, తన మనసు మాత్రం చిన్న బడ్జెట్ సినిమాలపైనే ఉందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "నా మనసు చిన్న బడ్జెట్ సినిమాలపైనే ఎక్కువగా ఉంటుంది. నా దగ్గరి వాళ్లే ఆశ్చర్యపోయేలా.. ఇతను మనోజ్ బాజ్‌పేయినా అనేలా నటిస్తే ఆ సంతృప్తే వేరు. అందుకోసమే నేను వాస్తవ జీవితానికి దగ్గరగా, మధ్యతరగతి ప్రజల భావోద్వేగాలను, సమస్యలను ప్రతిబింబించే సినిమాలు చేస్తా" అని తెలిపారు. కమర్షియల్ సినిమాలు చేస్తారా అని అడగ్గా.. 'చేయాలని నాకూ అనిపిస్తుంటుంది. కథ బాగుంటే ప్రేక్షకులు ఎలాంటి సినిమాలనైనా ఆదరిస్తారు. భవిష్యత్తులో ఏ సినిమాలు చేస్తానో ఇప్పుడే చెప్పలేను' అని సమాధానమిచ్చారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**